# PITHAPUR RAJAH'S GOVERNMENT COLLEGE (A), KAKINADA

# GENERAL TELUGU

# BA 2ND SEMESTER

# PAPER -2

# SRUJANATMAKA RACHANA

# 1.వ్యక్తీకరణ నైపుణ్యాలు

1. 'భాష' నిర్వచనాలను సమగ్రంగా వివరించి, భాషా స్వరూపాన్ని తెలియ జేయండి.

జ. భాష స్వరూప స్వభావాలను ప్రపంచవ్యాప్తంగా ఎందరో భాషావేత్తలు నిర్వచించారు. సంస్కృతంలో 'భాష్యతే ఇతి భాషా' అని భాషకు వ్యుత్పత్తి ఉంది. భాషింపబడేది భాష అని దీనికి అర్థం. కొన్ని నిర్వచనాలు చూద్దాం.

I. "పలు భాషల అలవాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ భాష" -హాకెట్

II. "ఒక సమాజంలోని సభ్యులు వ్యవహరించడానికి ఉపయోగించే స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థ భాష". -స్టూర్టెవ్మంట్

III. "ఒక సాంఘిక సముదాయం సహకరించుకోడానికి సాధనమైన స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థయే భాష". – బ్లూక్ & ట్రేగర్

IV. "చిత్తస్థితిని వ్యక్తం చేసేందుకు చేసిన, ఉద్దేశపూర్వక ధ్వనుల ఉచ్చారణయే భాష"-మాంటీ

V. "బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తే భాష"-ఇజ్లర్

VI. "అలవోకగా ఉత్పన్నమయ్యే కంఠధ్వనుల సాధనాలతో మానవతా సంబంధమైన సహజేతర పద్ధతి ద్వారా మానవోద్రేకాలను, ఆలోచనలను, వాంఛలను తెలియజేసేది భాష". – సఫేర్

VII. "మౌఖిక ధ్వనులు / కంఠధ్వనుల స్వతంత్ర వ్యవస్థే భాష". – సైమస్ పాటర్

VIII. “మనసులోని భావ పరంపరను ఏ వాక్యాలు, ఏ పదాలు ఎదుటి వారికి అందిస్తాయో, ఆ వాక్యాలు, పదాలే భాష”. -రామచంద్రవర్మ

పై భాషావేత్తలు నిర్వచించిన నిర్వచనాల్లో స్టూర్వెంట్, బ్లూక్ & ట్రేగర్ నిర్వచనాలు సమంజసంగా ఉన్నాయి. సంస్కృత వ్యాకరణవేత్తలు ‘ప్రకృతి ప్రత్యయ నిరూపణే భాష’ అని పేర్కొన్నారు.

భాషా వ్యవస్థను భాషావేత్తలు ఐదు ఉప వ్యవస్థలుగా విభజించారు. అవి :

వ్యాకరణ వ్యవస్థ :

ఇది పదాంశాల సముదాయాన్ని, వాటి వరుసక్రమాన్ని తెలుపుతుంది.

ధ్వన్యాత్మక వ్యవస్థ :

వర్ణాల సముదాయాన్ని, దాని వరుసక్రమాన్ని తెలియజేస్తుంది.

సంధివ్య వ్యవస్థ :

వాక్యంలో రెండు పదాలు లేదా పదాంశాలు దగ్గరగా ఉన్నప్పుడు ధ్వనుల్లో కలిగే మార్పులను తెలుపుతుంది.

అర్థ సంబంధ వ్యవస్థ :

పదాంశాలకు ఉన్న అర్థాలను తెలియజేస్తుంది.

ధ్వని వ్యవస్థ :

ఒక ధ్వని లేదా ఒక వర్ణం వ్యక్తి భేదాన్ని బట్టి ఉచ్ఛారణలో కలిగే భేదాన్ని తెలియజేస్తుంది.

పై వ్యవస్థల్లో మూడు వ్యవస్థలను మాత్రమే భాషావేత్తలు భాషగా చెపుతున్నారు. నాలుగు, ఐదు వ్యవస్థలు భాషా సంబంధాలు కావని కొందరి అభిప్రాయం.

కాళిదాసు భాషలో ఉన్న శబ్దార్థాలు రెండూ అర్ధనారీశ్వరులైన పార్వతీ పరమేశ్వరుల్లాంటివని వాటి ప్రాధాన్యాన్ని వర్ణించారు.

భాషలు ఎప్పుడు పుట్టాయి ? ఎక్కడ పుట్టాయి ? అనే అంశాల మీద పరిశోధనలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో మొదట్లో ఒకటే భాష ఉండేదని, కాలక్రమంలో ఆ భాషే అనేక భాషలుగా మారిందని కొందరు భాషా శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. దీనిని 'ఏకమూల భాషావాదం' అంటారు. కాని భాష అనేక ప్రదేశాల్లో అనేక రూపాల్లో పుట్టిందని, ఆ భాషలే ఎన్నో పరిణామాలకు లోనయి ఇప్పటి భాషలుగా ఏర్పడ్డాయని భాషా శాస్త్రజ్ఞులు నిర్ధారించారు.

భాష శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ప్రపంచం మొత్తంమీద 6000 భాషలు ఉన్నాయి. ఈ 6000 భాషలు, ఆ భాషల లక్షణాలను అనుసరించి భాషావేత్తలు పది భాషా కుటుంబాలుగా వర్గీకరించారు.

భారతదేశంలో 1652 భాషలున్నాయని, ఆ భాషలు నాలుగు భాషల కుటుంబాలకు చెందినవని భాషా శాస్త్రవేత్తలు తెలియజేశారు. మన తెలుగు ఈ భాషా కుటుంబాల్లో ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని నిర్ణయించారు. తెలుగుతో పాటు దక్షిణ భారతదేశంలో ఉన్న తమిళం, కన్నడం, మళయాళం కూడా ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన భాషలే.

భాషకు రాత రూపంలో ఆకారాన్ని కల్పించేది లిపి. అభివృద్ధి చెందిన భాషలకు లిపి ఉంటుంది. రాసే భాష మాట్లాడే భాష నుండే వచ్చింది. మొదట మాట్లాడే భాషకు, రాసే భాషకు తేడా ఉండేది కాదు. కాని కాలక్రమంలో రెండింటికి మధ్య తేడాలు ఏర్పడ్డాయి.

మాట్లాడే భాషలో కూడా తేడాలుంటాయి. ఒక వ్యక్తి పిల్లలతో ఒక విధంగా, కుటుంబ సభ్యులతో ఒక విధంగా, స్నేహితులతో ఒక విధంగా, సమావేశాల్లో ఒక విధంగా మాట్లాడుతాడు. అలాగే సాహిత్య ప్రక్రియల్లో ఉపయోగించే భాషకు, మాట్లాడే భాషకు తేడా ఉంటుంది. విద్యాధికులు మాట్లాడే భాషకు, చదువుకోనివారు మాట్లాడే భాషకు భేదం ఉంటుంది. ప్రాంతాలవారీగా మాట్లాడే మాండలిక భాషలకు, ప్రామాణిక భాషకు భేదం ఉంటుంది.

భాషా స్వరూపంలో ఎన్నెన్నో భేదాలు కనిపిస్తున్నా, భాష లక్ష్యం భావ వ్యక్తీకరణ మాత్రమే. భావ వ్యక్తీకరణ కోసం ఏర్పడిన భాష వలన మనిషికి, సమాజానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి.

...........

2. భాషా లక్షణాలను వివరించండి.

జ. మనిషికి అన్న పానాలలాగా భాష కూడా అవసరమైనదే. దాదాపు ఇరవై ఐదు వేల సంవత్సరాల క్రితం భాష పుట్టి ఉంటుందని భాషావేత్తల అభిప్రాయం. మానవ జీవితంలో, జీవనంలో సంభాషణ లేకపోతే జరగదు. ఆ సంభాషణకు భాష అవసరం. అటువంటి భాషకు ఏడు ప్రధానమైన లక్షణాలుంటాయని భాషా శాస్త్రజ్ఞులు వివరించారు.

**నిర్మాణ ద్వైవిధ్యం (Duality in construction)**

భాషలో రెండు నిర్మాణ క్రమ పద్ధతులు ఉంటాయి. అవి : ధ్వనులు ఒక పదంగా ఏర్పడడం, కొన్ని పదాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడడం, ప్రతి భాషలోను ఈ

విధంగానే వాక్య నిర్మాణం జరుగుతుంది. వీటినే వర్ణాత్మక వ్యవస్థ, వ్యాకరణ వ్యవస్థ అని అంటారు. ఇదే నిర్మాణ ద్వైవిధ్యం.

ప్రపంచంలోని ఏ భాషలో చూసినా 15 నుండి 60 వర్ణాలకు మధ్య అక్షరాలున్నాయి. వ్యాకరణ వ్యవస్థ వలననే భావం శ్రోతకు చేరుతుంది. అంటే అర్థం అవగాహన కావాలంటే వ్యాకరణ వ్యవస్థ ఉండాలి. ఈ వ్యవస్థ ఇతర ప్రాణుల్లో లేదు.

**ఉత్పాదన శక్తి (Productivity) :**

పదాల ద్వారా నిర్మాణమయ్యే వాక్యాన్ని

మానవుడు కొన్నిసార్లు ప్రయత్నపూర్వకంగా కొన్నిసార్లు అప్రయత్నంగా కల్పిస్తారు. చిన్నపిల్లలు భాషను తమ ఉత్పాదన శక్తి ద్వారానే నేర్చుకుంటారు. తరువాత కొత్త వాక్యాలను సృష్టిస్తారు. ఉత్పాదక శక్తి వలననే బాలురు గాని, పెద్దలు గాని కొత్త కొత్త వాక్యాలను సృష్టించడం, సృష్టించిన ఆ వాక్యాలు శ్రోతలు అర్థం చేసుకోవడం జరుగుతున్నది.

**శబ్దార్థ సంబంధ శక్తి (Arbitrariness) :**

ఒక పదం ఒక అర్థానికి సంకేతం. ప్రతి భాషలోని ప్రతి పదానికి అర్థం ఉంటుంది. శబ్దానికి అర్థంతో ఉండే సంబంధమే శబ్దార్థ సంబంధ శక్తి. 'నోరు' అనే పదానికి 'కన్ను' అనే అర్థం ఎందుకు రాలేదు ?- ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటంటే శబ్దార్థ సంకేతం కేవలం సంకేతతతో కూడి ఉండడమే అని చెప్పుకోవాలి. వైయాకరుణులు కూడా పదం 'శక్తితో కూడింది' అని చెప్పారు. ఈ పదానికి ఈ అర్ధమే ఎందుకుంది అనడానికి ఈశ్వర సంకేతమైన శక్తి మాత్రమే కారణం అని భాషావేత్తలు అంటారు. ఆధునిక భాషావేత్తలు కూడా అర్థానికి మానవ సంకేత శబ్ద శక్తే కారణమని తెలిపారు.

**వక్తృశ్రోతృ విపరిణామం (Interchangeability) :**

మనిషికి భాషా సంబంధంగా రెండు శక్తులు ఉంటాయి. 1) మాట్లాడగల శక్తి, 2) ఇతరులు మాట్లాడితే అర్థం చేసుకోగల శక్తి. ఈ రెండు శక్తులు ఉండడం చేతనే మనుషుల మధ్య సంభాషణ జరుగుతుంది. ఇతర ప్రాణులు మాటల ద్వారా కాక ధ్వనుల ద్వారా భావాన్ని వ్యక్తీకరిస్తాయి.

ప్రత్యేకత (Specialization) :

భావాన్ని వ్యక్తీకరించే సందర్భంలో ప్రేరణ, 5

ప్రతిక్రియ రెండూ ఉంటాయి. వీటికి దగ్గర సంబంధం ఉంటుంది. "వడ్డిస్తున్నా రండి" అని ఇల్లాలు చేసే ధ్వనులకు భర్త వంటగదిలోనికి వెళ్ళడం ప్రతిక్రియ అవుతుంది. ఇది శబ్దార్థ సంబంధమైన శక్తి వలన కలిగింది. ఇల్లాలు మాట్లాడిన భాష తెలియనివారు ఆ మాటలకు ప్రతి స్పందించే అవకాశం ఉండదు. అంటే ప్రతిక్రియ ఉండదు. ఇది భాషకున్న ప్రత్యేకత.

ప్రేరణదూరత (Displacement) :

మానవుడు తన మనసులో కలిగే 6

భావాలను మాట్లాడతాడు. అతడు కేవలం వర్తమాన సంఘటనల గురించే కాక, భూత, భవిష్యత్ కాలాలకు సంబంధించిన విశేషాలను గురించి కూడా మాట్లాడగలడు. పశు పక్ష్యాదులలో ఒక్క మానవునికి తప్ప భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు సంబంధించిన విషయాలపై స్పందించే శక్తి ఇతర ప్రాణులకు లేదు.

సాంస్కృతిక ప్రసరణ (Cultural Transmission) :

మానవుడు సంఘజీవి. సంప్రదాయ ఆచార వ్యవహారాలను ముందుతరం నుంచి స్వీకరించి ఆచరిస్తాడు. అలాగే భాషను కూడా స్వీకరించి మాట్లాడుతాడు. అనుకరణ

శక్తి వలన ఇది సాధ్యమవుతుంది. పిల్లలు మాట్లాడే భాషలో తప్పులుంటే పెద్దలు వాటిని సరిదిద్దుతారు. పిల్లలు, పెద్దలను అనుకరిస్తూ సవరించుకుంటారు. ఈ అనుకరణ శక్తి కొన్ని మానవేతర ప్రాణుల్లో ఉంది. కాని వాటిలో సాంస్కృతిక ప్రసరణ లేదు. అంటే వారు తరువాత తరం వారికి అందించలేరు. ఈ సాంస్కృతిక ప్రసరణ జీన్స్ ద్వారా, పరిసరాల ప్రభావం వల్ల జరుగుతుంది.

ఈ ఏడు లక్షణాలు ఉండడం వల్ల భాష తరతరాలుగా కొనసాగుతూ అభివృద్ధి చెందుతూ, మానవులకు ఉపయోగపడుతున్నది.

..........

3. భాష యొక్క ఆవశ్యకతను తెలియజేయండి.

జ. ఒక వ్యక్తి తన మనసులోని భావాలను ఇతరులకు తెలియజేయడానికి ప్రధాన సాధనం భాష. భాష వలననే సమాజం అభివృద్ధిని సాధిస్తుంది. విజ్ఞానం ప్రగతిని పొందుతుంది. ఒకటేమిటి మానవజాతి మనుగడ సాగించాలన్నా, అభివృద్ధిని సాధించాలన్నా అందుకు భాష అవసరం.భాషోత్పత్తిని గురించి ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. భిన్నాభిప్రాయాలు ఉన్నా ప్రపంచంలో తొలి భాష ఎప్పుడు పుట్టింది ? ఎక్కడ పుట్టింది ? అనే విషయాల గురించి ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. భాష పుట్టుక గురించి గత పాఠంలో వివరించుకున్నాం.

ప్రపంచంలో మొదట ఒకే భాష ఉండేదని, అదే అనంతర కాలంలో అనేక భాషలుగా విస్తరించాయని కొంతమంది భాషావేత్తల అభిప్రాయం. దీన్ని 'ఏకమూల భాషావాదం' అంటారు. కాలక్రమంలో భాష ఎన్నో మార్పులు పొంది అనేక భాషలుగా మారిందని భాషా పండితులు అభిప్రాయపడ్డారు. భాష ఏదైనా భావాన్ని వ్యక్తీకరించడానికి ఆ

భాష అవసరం. ఆ భాష లేకపోతే మానవుడు ఆదిమానవునిగానే మిగిలిపోయేవాడు.

ప్రపంచవ్యాప్తంగా ఆరువేల భాషలున్నాయనీ, మన భారతదేశంలోనే 1652 భాషలు మాట్లాడే ప్రజలున్నారని భాషావేత్తలు అంటారు. ఈ భాషావేత్తలు ప్రపంచంలోని భాషలన్నింటిని పది భాషా కుటుంబాలుగా విభజించారు. వానిలో భారతదేశంలో ఉన్న 1652 భాషలను నాలుగు భాషా కుటుంబాలుగా వర్గీకరించారు. అందులో మన తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని నిర్ధారించారు.

భారతదేశంలోని భాషలలో 18 భాషలను భారత రాజ్యాంగం 85 షెడ్యూల్లో ప్రకటించారు. ఇవన్నీ ఆమోదం పొందిన భాషలు. అంటే రాజ్యాంగం గుర్తించిన భాషలన్నమాట. అవి

1) తమిళం,
2) కన్నడం,
3) మళయాళం,
4) తెలుగు,
5) పంజాబి,
6) మరాఠీ,
7) బెంగాలి.
8) హిందీ,
9) ఉర్దూ,

10) ఒరియా,

11) కాశ్మీరి,

12) గుజరాతి,

13) సంస్కృతం,

14) అస్సామీ,

15) సింధి,

16) కొంకణి,

17) మణిపురి,

18) నేపాలి.

వీనిలో చివరి మూడు భాషలు 71వ రాజ్యాంగ సవరణ ద్వారా అధికార భాషలుగా నిర్ణయింపబడినాయి.

భాషకు ఆకారాన్ని కల్పించేది లిపి. అభివృద్ధి చెందిన అన్ని సమాజాలు తమ భాషకు లిపిని కలిగి ఉన్నాయి. వ్రాసే భాష, మాట్లాడే భాష నుంచే జన్మిస్తుంది. తొలి కాలంలో మాట్లాడే భాష, వ్రాసే భాష ఒకే విధంగా ఉంటాయి. కాని కాలక్రమంలో మాట్లాడే భాషకు, వ్రాసే భాషకు తేడా ఏర్పడుతుంది. అంతేగాక మాట్లాడేభాషలో కూడా భేదాలు గోచరిస్తాయి. వ్యక్తి ఒకడే అయినా పిల్లలతో ఒక విధంగా, కుటుంబ సభ్యులతో ఒక విధంగా, కొత్త వ్యక్తులతో మరొక విధంగా, సభల్లో సమావేశాల్లో ఇంకొక విధంగా మాట్లాడుతాడు. ఈ తేడాలు అన్ని భాషా సమాజాల్లో కనిపిస్తాయి. ఆదిమ సమాజంలోని భాషల్లో కూడా ఈ తేడాలు ఉన్నాయని భాషావేత్తలు అంటారు. అదే విధంగా సాహిత్యంలోని భాషకు నిత్య జీవితంలో వ్యవహరించే భాషకు భేదం

ఉంటుంది. అలాగే విద్యావంతుడు మాట్లాడే భాషకు, నిరక్షరాస్యులు మాట్లాడే భాషకు వ్యత్యాసం ఉంటుంది. ప్రాంతాలకు పరిమితమైన మాండలిక భాషలకు, గ్రాంథిక భాషకు తేడా ఉంటుంది. భాషను ఉపయోగించే తీరులో భేదాలున్నా భాష యొక్క లక్ష్యం భావ వ్యక్తీకరణమే. భావ వ్యక్తీకరణ లేకపోతే మనిషి అభివృద్ధి చెందలేడు. అన్ని రంగాల్లో మానవుని ప్రగతికి మూలం భాషే. అందుచేత భాష మనిషికి నిత్యావసరమని చెప్పవచ్చు.

.........

2. భాషను నిర్వచించి, భాషా ప్రయోజనాలను వివరించండి.

(లేదా)

భాషా నిర్వచనాలను తెలిపి, భాష వలన కలిగే ప్రయోజనాలను రాయండి.

జ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాషావేత్తలు భాషను నిర్వచించారు. సంస్కృతంలో "భాష్యతే ఇతి బాష" అనగా 'భాషింపబడేది భాష' అని భాషా పదానికి వ్యుత్పత్తిని చెప్పారు. ఇతర నిర్వచనాలు.

I. "ఒక సమాజంలోని సభ్యులు వ్యవహరించడానికి ఉపయోగించే స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థయే భాష". -స్టూర్వెంట్

II. ఒక సాంఘిక సముదాయం సహకరించుకోడానికి సాధనమైన స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థ భాష. -బ్లూక్ & ట్రేగర్

III. చిత్త వృత్తిని వ్యక్తం చేసేందుకు చేసిన ఉద్దేశపూర్వక ధ్వనుల ఉచ్చారణయే భాష.-మాంటి

IV. "బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తి భాష"-ఇజ్లర్

V. “అలవోకగా ఉత్పన్నమయ్యే కంఠధ్వనుల సాధనాలతో మానవతా సంబంధమైన సహజేతర పద్ధతుల ద్వారా మానవోద్రేకాలను, ఆలోచనలను, వాంఛలను తెలియజేసేది భాష”. – సఫేర్

VI. “మౌఖిక ధ్వనుల / కంఠధ్వనుల స్వతంత్ర వ్యవస్థ భాష. -సైమస్ పాటర్

VII. “మనసులోని భావ పరంపరను ఏ వాక్యాలు, ఏ పదాలు ఎదుటివారికి అందిస్తాయో, ఆ వాక్యాలు, పదాలే భాష”. -రామచంద్ర వర్మ

VIII. “ప్రకృతి, ప్రత్యయాల నిరూపణే భాష”. -వ్యాకరణవేత్తలు

పైన చెప్పిన నిర్వచనాల్లో స్టూర్వెంట్, బ్లూక్ & ట్రేగర్, సఫేర్ వంటి భాషా శాస్త్రవేత్తల నిర్వచనాలు సమంజసంగా ఉన్నాయి.

భాషా ప్రయోజనాలు :

భాష నిత్య వ్యవహారంలో ఉపయోగించడం వలన మానవులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి.

1) భావాన్ని వ్యక్తీకరించడానికి, భావాన్ని గ్రహించడానికి భాష అవసరం. అది లేనిదే మనుషుల మధ్య సంభాషణ, భావ వినిమయం ఉండదు.
2) మనిషి దైనందిన జీవితంలో తమ అవసరాలను తీర్చుకోవాలంటే భాష ఉపయోగపడుతుంది.
3) జాతి సంస్కృతిని సంప్రదాయాలను, సాహిత్యాన్ని భాష పరిపుష్టం చేస్తుంది.
4) వ్యక్తి వికసించడానికి, జాతి అభివృద్ధి చెందడానికి భాష పనికి వస్తుంది.

5) భాషా నైపుణ్యాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. వ్యక్తిత్వ వికాసం ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చు. సంస్కారాన్ని పొందవచ్చు.

6) బోధనకు, అభ్యసనానికి భాష ఉపయోగపడుతుంది.

7) విజ్ఞాన సముపార్జన భాష వలననే జరుగుతుంది.

8) సృజనాత్మకతను పెంచి, విభిన్న ప్రక్రియల్లో రచనా శక్తికి భాష తోడ్పడు. తుంది.9) మనుషుల్లో జాతీయ భావాలు కలిగించి, దేశభక్తిని, భావ సమైక్యతను కలిగించే శక్తి భాష ద్వారా వస్తుంది.

9) కళల్లో భాగాలయిన పాట, పద్యం వంటి సాహిత్య రూపాల వలన శ్రోతలకు ఆనందం కలుగుతుంది.

10) వ్యాపార వాణిజ్యాలు, వృత్తుల నిర్వహణ, ఆదాయ సముపార్జన భాష వలననే జరుగుతాయి.

11) విజ్ఞానశాస్త్ర సంబంధ ప్రయోగ ఫలితాలను నమోదు చేయడానికి, ఆ ఫలితాలను తరువాతి తరానికి అందజేయడానికి భాష ఉపయోగ పడుతుంది.

12) సాంకేతికాంశాలకు, గణితము మొదలైన శాస్త్రాంశాలకు సంబంధించిన భావనలు, పారిభాషిక పదాలు భాష ద్వారానే నేర్చుకొని ఎవరైనా విజ్ఞాన వంతులు, మేధావులు అవుతారు.

13) సాహిత్యం, ఇతర కళల ద్వారా అనుభూతిని కలిగించడం, హృదయ వికాసాన్ని కలిగించడం భాష వలననే కలుగుతుంది.

కాబట్టి మనుషులు భాషను కాపాడుకోవాలి. భాషా నైపుణ్యాలను పెంపొం దించుకుంటూ అభివృద్ధిని పొందాలి.

..........

3. భాషోత్పత్తి వాదాల గురించి వ్రాయండి.

(లేదా)

భాష పుట్టుకను గురించి భాషా శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిన వివిధ సిద్ధాంతాలను గురించి వ్రాయండి.

(లేదా)

వివిధ భాషా వాదాలను గురించి తెలిపి, వానిలో ఏయే సిద్ధాంతాలు సమంజస మైనవో మీ అభిప్రాయం తెలపండి.

జ. మానవుడిని మిగిలిన ప్రాణుల కన్నా భిన్నంగా, ఉన్నతంగా తీర్చిదిద్దింది. భాష. అలాంటి భాష మొట్టమొదట ఎలా పుట్టింది, ఎక్కడ పుట్టింది అనే విషయాల గురించి ఎన్నెన్నో వాదాలు, సిద్ధాంతాలు బయలుదేరాయి. అందులో ముఖ్యమైన వాదాలను గురించి చెప్పుకుందాం.

దైవ ప్రసాద వాదం :

భాషను దైవమే సృజించాడనేది ఈ వాదం

ప్రతిపాదన. అనేక మతాలు, రకరకాల దేవుళ్ళు ఉన్నారు గదా ! ఏ దేవుడు ఏ భాషను సృష్టించాడనే సందేహం కలుగుతుంది. ఈ సందేహానికి తగిన సమాధానం లేదు.

సమాలోచన వాదం :

ఆదిమ మానవులందరూ ఒకచోట సమావేశమై భాషను కల్పించుకున్నారని ఈ వాదం చెపుతుంది. దీనికి కూడా తగిన ఆధారాలు కనిపించవు.

డింగ్ డాంగ్ వాదం :

పదార్థానికి, పదానికి సంబంధం ఉందని ఈ వాదం తెలుపుతుంది. ఆదిమానవుడు తాను చూసిన వస్తువులను బట్టి, కలిగిన ఆలోచనలను బట్టి స్పందించి, వాటికి అనుగుణంగా ధ్వనులు చేసేవాడని, ఆ ధ్వనులతో భాష ఏర్పడిందని మాక్స్ ముల్లర్ ఈ వాదాన్ని ప్రతిపాదించాడు. ఇది అశాస్త్రీయమని భాషావేత్తలు తిరస్కరించారు.

పూహూవాదం :

మానవునికి కలిగే సుఖ దుఃఖాలు, ఆశ్చర్యం, కోపం మొదలైన భావాలు వ్యక్తం చేయడానికి కొన్ని శబ్దాలను ఉచ్చరిస్తాడు. అబ్బా, అయ్యో మొదలైన అలాంటి శబ్దాల నుండి భాష పుట్టిందని ఈ వాదం తెలియజేస్తుంది. కాని ఈ శబ్దాలు భాష కాదని భాషా శాస్త్రజ్ఞులు ఈ వాదాన్ని నిరాకరించారు.

సంజ్ఞా సిద్ధాంతం :

మానవుడు తొలుత సంజ్ఞల ద్వారా తన భావాలను తెలియజేసేవాడని, అందుకోసం అవయవాలను కదిలించేవాడని కొంతమంది అభిప్రాయం. క్రమంగా పనుల కోసం చేతుల అవసరం పెరగడంతో, ముఖం ద్వారా భాషను రూపొందించుకున్నాడని ఈ సిద్ధాంతం తెలియజేస్తుంది.

సంగీత సిద్ధాంతం :

భాష, సంగీతం ఒకేసారి పుట్టాయని జెస్పర్ సిద్ధాంతం. ఆదిమ మానవుడు తన ప్రేమను సంగీతం ద్వారా వ్యక్తీకరించాడని అతని భావన.

సంసర్గ సిద్ధాంతం :

మనిషి తనతోపాటు జీవించే ఇతర మనుషులతో అనుబంధాన్ని పెంచుకోడానికి భాషను సృష్టించుకున్నాడని ఈ సిద్ధాంతం తెలియజేస్తుంది. అది వరుసగా ధ్వనులు తరువాత కేకలు, చివరగా భాషగా రూపొందిందని ఈ సిద్ధాంతం తెలుపుతుంది.

ధ్వన్యనుకరణ వాదం :

జంతువులు చేసే శబ్దాలను గమనించి 'మే' అని అరిచే దానిని మేక అని, 'కావ్' అని అరిచే దానిని కాకి అని సంకేతికంగా పిలిచారని, ఆ శబ్దాల నుండే భాష పుట్టిందని చెప్పే వాదమిది. కాని ఇలాంటి ధ్వనులు, వాటి ఆధారంగా ఏర్పడే పేర్లు చాలా తక్కువగా ఉంటాయి.

ధాతువాదం :

భాషకు మూలం ధాతువులని, ఆ ధాతువుల నుండి శబ్దాలు పుడుతాయని చెప్పే వాదమిది. సంస్కృతాది భాషల్లో ధాతువుల నుండే శబ్దాలు ఉద్భవిస్తాయి. ధాతువుల నుండి పదాలు పుడతాయి అనేది అంగీకరించ వచ్చుగాని, ధాతువులు ఎలా పుట్టాయి అనే దానికి జవాబు లేదు.

సంపాదన సిద్ధాంతం:

అనుభవం ద్వారా భాషను నేర్చుకుంటారని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. పరస్పర స్పందనల వలన ఏర్పడే అలవాట్లు జ్ఞానాన్ని, భాషా సముపార్జనను కలిగిస్తాయని. పిల్లలు పెద్దలను అనుకరిస్తూ భాష నేర్చుకుంటారని ఈ సిద్ధాంతం తెలుపుతుంది.

యోహిహెూవాదం:

శ్రమ చేసేటప్పుడు పుట్టే ధ్వనుల వలన భాష పుడుతుందని ఈ వాదం తెలుపుతుంది. పనిచేసేవాళ్ళు, ఆ శ్రమను మరచి పోవడానికి కొన్ని శబ్దాలు

చేస్తారని, ఆ శబ్దాల నుంచే భాష పుడుతుందని ఈ వాదం తెలుపుతుంది. సంఘ జీవన విధానంలో భాష ఏర్పడుతుందని వీరి భావన.

స్వతస్సిద్ధ సిద్ధాంతం:

మనిషికి జన్మతోనే జీన్స్ వలన భావాలు, భాష సంక్రమిస్తాయని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. మిగిలిన ప్రాణుల కన్న మనిషి మెదడు పెద్దదిగా, విలక్షణమైనదిగా, విశిష్టమైనదిగా ఉంటుందని వీరు అంటారు.

సహజ పరిణామ సిద్ధాంతం:

ఆదిమ మానవుడు, మొదట సంజ్ఞల ద్వారా, తరువాత ధ్వనుల ద్వారా, ఆ తరువాత పదాల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి ఉంటాడు. భావ వ్యక్తీకరణ కోసం మొదట పదాలు ఏర్పడిన తరువాత వాటిని పరిసర మానవులు అంగీకరించి ఉంటారు. అంటే కాలగమనంలో మానవ సమూహం భాషను ఏర్పరచుకొని ఉంటుంది.

పై సిద్ధాంతాల్లో స్వతస్సిద్ధ, సహజ పరిణామ సిద్ధాంతాలు సబబైనవిగా భాషావేత్తలు భావిస్తారు.

ప్రపంచంలో ఒకప్పుడు ఒకే భాష ఉండేదని, క్రమంగా ఉచ్చారణలోను, ప్రాంతాలలోను భేదాలను బట్టి అనేక భాషలయ్యాయని కొందరు అంటారు. దీనిని ఏకమూల భాషావాదం అంటారు. అలా కాకుండా ప్రపంచంలో మొట్టమొదట అక్కడక్కడా కొన్ని భాషలు పుట్టాయని, అవి క్రమంగా ఉచ్ఛారణా భేదం వల్ల, ప్రాంతాల భేదం వల్ల అనేక భాషలయ్యాయని మరికొందరు అంటారు. దీనిని బహుమూల భాషావాదం అంటారు. ఈ రెండు వాదాల్లో బహుభాషావాదమే ఆమోదయోగ్యంగా ఉంది.

.............